క్లుప్తంగా

కులవివక్షపై విచారణ



అచ్చంపేట: కులాంతర వివాహం చేసుకున్నందుకు వేధిస్తున్నారని, కులవివక్ష చూపుతున్నారంటూ మండలంలోని చెరుకుపాలెం బీసీ కాలనీకి చెందిన చెందిన కత్తుల నాగసంధ్య ఎలియాస్ పుష్పలత, కత్తుల గోపీకృష్ణరెడ్డి జాతీయ ఎస్సీ, ఎస్టీ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేయగా తహసీల్దార్ కె.చంద్రశేఖర్ మంగళవారం విచారణ చేశారు. దారికి అడ్డంగా వేసిన కంచెను పీకించారు. పంచాయతీ వారు వేసిన రోడ్డును వినియోగించుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని, ఆటంక పరిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. బాధిత కుటుంబం మంచినీళ్లు వాడుకునేందుకు అవకాశం కల్పించారు. మంచినీటి కుళాయి కూడా వేయాలని పంచాయతీ కార్యదర్శి శివయ్యను ఆదేశించారు. కులవివక్షనేరమని, పాల్పడినవారు శిక్షార్హులని హెచ్చరించారు. ఆయన వెంట వీఆర్వో నాగేశ్వరరావు, సీపీఎం స్థానిక బాధ్యుడు వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

121 మందికి అన్నదానం



సత్తెనపల్లి: పట్టణంలోని మాస్టిన్‌పేటలో ఇటీవల కురిసిన వర్షాలకు ఆ ప్రాంతం బురదమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇక్కట్లను జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షురాలు వలేటి కుమారి ద్వారా తెలుసుకున్న న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు దాతల సహకారంతో మంగళవారం 121 మందికి అన్నసంతర్పణ చేశారు. అన్నం మల్లికార్జునరావు తిథి సందర్భంగా వారి పెద్ద కుమారుడు అన్నం కృష్ణమూర్తి, విజయదుర్గ అన్నసంతర్పణలో భాగస్వాములయ్యారు.

నకరికల్లు ఎస్ఐగా సతీష్




నకరికల్లు: ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారిస్తానని ఎస్ఐ కె.సతీష్ అన్నారు. నకరికల్లు ఎస్ఐగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ కె.సతీష్‌ను, నకరికల్లు నుంచి బదిలీపై వెళ్తున్న ఎస్ఐ చల్లా సురేష్‌ను సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కె.ఎస్.ఎన్.నారాయణ షేక్ సుభాని, డి.చెన్నకేశవులు, జానయ్య, రమేష్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్వహణకు బహిరంగ వేలం

నకరికల్లు: స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలోని కల్యాణమండపం నిర్వహణకు బహిరంగ వేలం పాట ఈనెల 2వ తేదీ ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బండి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణ మండపంలో జరిగే ఫంక్షన్‌లకు ఎలక్ట్రికల్ డెకరేషన్, పూల డెకరేషన్ ఏర్పాటు చేసేందుకు ఫంక్షన్లకు వంటపాత్రలు, షామియానాలు, కుర్చీలు తదితర వస్తువులు అద్దెకు ఇచ్చే హక్కు కోసం వేలంపాటలో పాల్గొనవచ్చని సూచించారు. హక్కుపొందిన వారికి 1అక్టోబర్ 2025 నుంచి 30 సెప్టెంబర్ 2026 వరకు కాల పరిమితి ఉంటుందని తెలిపారు. రెండు విభాగాలకు విడివిడిగా ధరావత్తు రూ.25వేలు చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు దుర్భరం



నకరికల్లు: మాదక ద్రవ్యాలతో జీవితాలు దుర్భరమవుతాయని లింక్‌వర్కర్ స్కీమ్ జోనల్ సూపర్‌వైజర్ ఎం.విశ్వేశ్వరరావు అన్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా, లింక్‌వర్కర్ స్కీం ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ, మాదకద్రవ్యాలు అరికట్టడంపై అవగాహన సదస్సును మండలంలోని నర్సింగపాడులో మంగళవారం నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. హెచ్ఐవీ బాధితులతో ప్రేమగా ఉండాలని, వారిని దూరం పెట్టకూడదన్నారు. మాదకద్రవ్యాల వినియోగం అరికట్టడం, ఎయిడ్స్ వ్యాధి అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. నకరికల్లు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ మణికంఠ మాట్లాడుతూ వ్యసనాలకు బానిసలైన వారు వాటిని వీడే వరకు అండగా ఉండాలన్నారు. హెచ్ఐవీ, క్షయ, సుఖవ్యాధులకు ఉచిత మందుల కోసం 1097లోసంప్రదించాలన్నారు. సర్పంచ్ సంగు రామకోటమ్మ, లింక్‌వర్కర్ దయామణి, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పేరుకే 24 గంటలు.. సేవలు పేలవం

- ఇటీవల వైద్యం అందక వ్యక్తి మృతి
- గత ప్రభుత్వ హయాంలో రూ.1.50 కోట్లతో అధునాతన వైద్యశాల నిర్మాణం
- నలుగురు వైద్యులతో నిరంతర పర్యవేక్షణ ఉండేది
- అచ్చంపేట పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసే దిక్కు కూడా లేని పరిస్థితి



అచ్చంపేటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

అచ్చంపేట: పేరుకే 24 గంటల ఆస్పత్రి.. సేవలు మాత్రం రోగులకు పేలవంగా అందుతున్నాయి. అచ్చంపేటలో 24 గంటల ప్రభుత్వ వైద్యశాల ఉంది. స్థానికుడు షేక్ నాగుల్‌మీరాను ఇటీవల ప్రాణాపాయ పరిస్థితుల్లో బంధువులు వైద్యశాలకు తీసుకెళితే ప్రథమ చికిత్స చేసే వారు కూడా లేక అతను మరణించిన పరిస్థితి ఇటీవల చోటుచేసుకుంది. మండలంలో రెండు పీహెచ్‌సీలు ఉండాలి. కానీ 23 గ్రామ పంచాయతీలు, 28 గ్రామాలు, నాలుగు గిరిజన తండాలకు కలిపి ఒక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాత్రమే ఉంది. మండల జనాభా 70వేలకు పైగా ఉంటుంది. అచ్చంపేటలో పీహెచ్‌సీ నుంచి ఎటు చూసిన 20 నుంచి 30 కిలోమీటర్ల విస్తీర్ణం ఉంది.

ఏడాదిన్నరగా స్థలాన్వేషణే

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రెండో పీహెచ్‌సీ నిర్మాణానికి చెరుకుపాలెంలో స్థలసేకరణ చేశారు. నిధులూ మంజూరయ్యాయి. ఇంతలో ఎన్నికలు సమీపించి, కోడ్ అమలులోకి రావడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం.. నాడు సేకరించిన స్థలం పనికిరాదని, వేరే స్థలం కోసం ఏడాదిన్నరగా అన్వేషిస్తూనే ఉంది. మండలానికి రెండో పీహెచ్‌సీ మంజూరు కావడంతో ఆ వైద్యశాలకు గత ప్రభుత్వ హయంలోనే నియమించిన ఇద్దరు వైద్యులు, ఐదుగురు వైద్య సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అచ్చంపేట పీహెచ్‌సీలోనే పని చేస్తున్నారు. ఒక్కొక్క పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు చొప్పున రెండు పీహెచ్‌సీలకు కేటాయించిన నలుగురు అచ్చంపేటలోనే విధులు నిర్వహిస్తున్నారు.

నలుగురిలో ఒక్కరూ లేరు

అచ్చంపేటకు చెందిన షేక్ నాగుల్ మీరా అనే రోగి తీవ్ర అనారోగ్యంతో ఈనెల 21న పీహెచ్‌సీకి వెళితే ఉండాల్సిన నలుగురు వైద్యుల్లో ఒక్కరూ లేకపోవడంతో సకాలంలో వైద్యం అందక మృతి చెందాడని బంధువులు ఆరోపిస్తున్నారు. నలుగురు డాక్టర్లలో ఒక పోస్టు ఖాళీగా ఉండగా మరొకరు 104 విధులకు వెళ్లారని చెబుతున్నారు. మరొకరు సెలవులో ఉండగా, డ్యూటీలో ఉండాల్సిన డాక్టరు గైర్హాజరయ్యారు. ఉన్న స్టాఫ్ నర్సుకు పరిస్థితిపై అవగాహన లేకపోవడంతో సకాలంలో వైద్యసేవలు అందలేదు. ప్రయివేటు వైద్యశాలలో చూపించుకునే శక్తి ఆ రోగికి లేదు. 108 వాహనంలో సత్తెనపల్లి తరలించే లోపే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు చిన్నారులు, భార్య ఉన్నారు, వారి పరిస్థితి ఏంటి.. దీనికి బాధ్యత ఎవరు వహించాలి? డ్యూటీలో ఉండాల్సిన డాక్టరును సస్పెండ్‌చేసి చేతులు దులుపుకుంటే ఆ కుటుంబాన్ని ఆదుకునేదెవరు? ఇది ఉన్నతాధికారులు, పాలకులు, ప్రభుత్వ పర్యవేక్షణ లోపం కాదా?

గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్య భాగ్యం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మండలంలో గ్రామా గ్రామాన హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా వైద్యసిబ్బందిని నియమించి నిరంతరం పర్యవేక్షించేవారు. డాక్టర్స్ కాన్సెప్ట్ కింద ప్రతి గ్రామంలో ఇంటింటికీ వైద్యసేవలను అందించేవారు. మెరుగైన వైద్యం అవసరమైనవారిని అచ్చంపేట, సత్తెనపల్లి పీహెచ్‌సీలకు తరలించి స్పెషలిస్ట్ వైద్యులతో సేవలు అందించేవారు.

కొరవడిన పర్యవేక్షణ

ఇప్పుడు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పట్టించుకునేవారు లేకపోవడంతో వైద్యసిబ్బందికి ఒకరితో ఒకరికి అవగాహన లేక సమన్వయం లోపించింది. వైద్యుల గైర్హాజరు ఎక్కువైంది. అన్ని ఉన్నా అల్లుడినోట్లో శని అన్న చందంగా ఉంది వైద్యశాల పరిస్థితి. గత ప్రభుత్వం నిర్మించిన పక్కా భవనం, ఆపరేషన్ థియేటర్, రక్త పరీక్షలు నిర్వహించేందుకు అధునాతన పరికరాలు, అధునాతన ఫార్మసీ అన్ని ఉన్నాయి. కానీ వైద్య సేవలే కరువయ్యాయి.

డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్ని సస్పెండ్ చేశారు



మృతి చెందిన రోగిని తీసుకువచ్చిన సమయంలో స్టాఫ్ నర్స్ పరీక్షించారు. పల్స్ పూర్తిగా డౌన్ అయ్యాయి. స్పృహ లేదు. అతనికి తెలియకుండానే మల విసర్జన కూడా చేసుకున్నాడు. డాక్టర్ ఉన్నా ఆ సమయంలో ఏమి చేయలేని పరిస్థితి. పరిస్థితి విషమించిన తర్వాత తీసుకువచ్చారు. అక్కడికి 108వాహనం పిలిపించి సత్తెనపల్లి పంపే ప్రయత్నం చేశాం. రోగి బంధువులు తర్జనభర్జన పడ్డారు. ప్రయివేటు వైద్యశాలకు తీసుకువెళ్లే ఆలోచనతో వెంటనే స్పందించలేదు. దీంతో కొంత సమయం పట్టింది. ఈ లోపే రోగి ప్రాణం పోయింది. అయినా రోగి వచ్చిన సమయంలో డాక్టర్ రాజేష్ లేకపోవడంతో డీఎంఅండ్ హెచ్‌వో రవికుమార్ అతన్ని సస్పెండ్‌చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

– రాంబాబునాయక్, వైద్యాధికారి, అచ్చంపేట

నాయీ బ్రాహ్మణులను అవమానించిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న అమరావతి నాయీబ్రాహ్మణసంఘ నాయకులు

అమరావతి: బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు నాయీ బ్రాహ్మణ కులవృత్తిని కించపరిచేలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అమరావతి నాయీబ్రాహ్మణ సంఘ నాయకుడు ఉంగుటూరు నిబద్ధి అన్నారు. మంగళవారం పాత లారీ ఆఫీసు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అయి ఉండి నాయీబ్రాహ్మణుల మనోభావాల్ని దెబ్బతీసేలా మాట్లాడారన్నారు. ఓ రాజకీయ పార్టీ మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ చలో బాపట్లకు పిలుపునిచ్చింది దీనిపై విమర్శలు చేయాలనుకుంటే రాజకీయపార్టీపై విమర్శలు చేయాలేగానీ నాయీబ్రాహ్మణకులాన్ని విమర్శించడం దారుణమన్నారు. ఎమ్మెల్యే శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేసి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయీబ్రాహ్మణసంఘ నాయకుడు చింతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో నాయీ బ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానని చంద్రబాబు వ్యాఖ్యలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు టీడీపీ ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు జీవో నంబర్ 51ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూరిబాబు, సత్యనారాయణ, నాగరాజు, సాంబశివరావు, చిన్ననాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానరూపిణి

- వేదమాతగా అమ్మవారు దర్శనం
- ప్రత్యేక కుంకుమ పూజలు

సత్తెనపల్లి: విశ్వవిలాసిని అమ్మవారిని నిహతమునిను భజింతుమే అని భక్తజనం ప్రత్యేక పూజలు చేశారు. దేవీ నవరాత్రుల్లో రెండో రోజు సత్తెనపల్లి డివిజన్ పరిధి సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో అమ్మవారు వేదమాత గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు విజ్ఞానరూపిణిని దర్శించుకున్నారు. పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం, త్రిశక్తి దుర్గాపీఠం, గుంటూరు రోడ్డులోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, వెంకటపతి కాలనీలోని శ్రీ లక్ష్మీ ప్రత్యంగిరా అమ్మవారి పీఠంలో, మున్సిపల్ కార్యాలయ సమీపంలోని మేదర సంఘ రామాలయం వద్ద, వడ్డవల్లి పెద్దబొడ్డురాయి సెంటర్‌లో అమ్మవారిని వేదమాతా గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. పట్టణంలోని కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద అమ్మవారిని శ్రీ పర్వత వర్ధినిదేవిగా అలంకరించి పూజలు చేశారు. పెదమెక్కెన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో అమ్మవారిని పంచముఖిగా దర్శనమిచ్చారు.

ముప్పాళ్ళ: లంకెలకూరపాడు ఆలయంలో శ్రీగాయత్రీదేవి అలంకారంలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు.



సత్తెనపల్లి త్రిశక్తి దుర్గా పీఠంలో గాయత్రీదేవి

నకరికల్లు: చేజర్లలోని గంగా భ్రమరాంబ పార్వతీ సహిత సమేత కపోతేశ్వరస్వామి ఆలయంలోను, నర్సింగపాడు గ్రామంలోని మరకతలింగ చంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలోను అమ్మవారు కౌమారీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అచ్చంపేట: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో మంగళవారం వాసవీ మాత కన్యకాపరమేశ్వరిగా భక్తులకు సాక్షాత్కారమిచ్చారు.

పెదకూరపాడు: లింగంగుంట్ల శివాలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా పూజలందుకున్నారు.

రాజుపాలెం: బ్రాహ్మణపల్లి శివాలయంలో శ్రీఅన్నపూర్ణాదేవి గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అంకమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



వెంకటపతికాలనీలో గాయత్రీదేవి



సత్తెనపల్లి కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద శ్రీ పర్వత వర్ధినిదేవి

బెల్లంకొండ: స్థానిక మహాలక్ష్మి పీఠంలో మంగళవారం అమ్మవారు బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి రెండో రూపం గాయత్రీదేవి అవతారమని శతాధిక ప్రతిష్ఠాచార్య పులుపుల వేంకట ఫణికుమార శర్మ తెలిపారు. నాగిరెడ్డిపాలెంలో దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



చేజర్లలో కౌమారీదేవిగా..



అచ్చంపేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



లింగంగుంట్ల శివాలయంలో గాయత్రీ దేవి అలంకారంలో అమ్మవారు

చినుకు పడితే చింతే

- వాన పడితే ఆ కాలనీలకు కష్టాలే
- ముంపునకు గురవుతున్న నాగన్నకుంట, సుందరయ్యకాలనీ, వెంకటపతినగర్, యానాది కాలనీ, మాస్టిన్‌పేట
- ఆక్రమణలకు గురైన వడ్డవల్లి ఎద్దువాగు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

సత్తెనపల్లి: చినుకు పడితే సత్తెనపల్లి వాసులకు చింతే. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వారికి ఇక్కట్లు తప్పడం లేదు. వర్షం పడితే నీటితోపాటు డ్రెయినేజీ నీరు ఏకమై రోడ్లపై పారుతున్నాయి. దీంతో ప్రధానవీధులు తటాకాల్లా కనిపిస్తున్నాయి. మురుగు కాలువలను ఆక్రమించి దుకాణాలు, బండలు వేస్తున్నా మున్సిపల్ అధికారుల చర్యలు కానరావడం లేదు. పూడికలు తీయలేని పరిస్థితి ఎదురవుతోంది. వర్షం పడితే పట్టణంలోని నాగన్నకుంట, సుందరయ్యకాలనీ, వెంకటపతినగర్, యానాదికాలనీ, మాస్టిన్‌పేట పూర్తిగా నీట మునుగుతున్నాయి. వీటికి తోడు శాలివాహననగర్, దోబిఘాట్ సమీపంలో వర్షం నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.


ఆక్రమణల బారిన

వడ్డవల్లి ఎద్దువాగు నుంచి నరసరావుపేట రోడ్డు దాటి మాచర్ల రోడ్డులోకి వర్షం నీరు వెళ్లాలి. వడ్డవల్లి ఎద్దువాగు అడుగడుగునా ఆక్రమణలకు గురికావడంతో వాన నీటి ప్రవాహానికి అడ్డంకి మారి ఇళ్లల్లోకి నీరు చేరుతుంది. ఇది ఇలా ఉంటే మాచర్ల రోడ్డులో రహదారి పక్కన అధికార పార్టీకి చెందిన సానుభూతిపరుడు ఇళ్ల స్థలాల వెంచర్ వేశాడు. అక్కడకు వెళ్లేందుకు నరసరావుపేట రోడ్డు దాటాక 20 అడుగుల కాలువను కుదించుకుపోయేలా చేశారు. వర్షం వస్తే నీరు వెళ్లే దారిలో కాలనీలు జలమయమవుతున్నాయి. ఆదివారం కురిసిన భారీ వర్షానికి ఈ ఐదు కాలనీలు పూర్తిగా నీటమునిగాయి. ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ప్రజాప్రతినిధులకు ఓట్ల సమయంలోనే మేం గుర్తుకొస్తాం.. మా కష్టాలు పట్టవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ పటిష్ట పరచాలని వారు కోరుతున్నారు.



ఆక్రమణలకు గురైన వడ్డవల్లి ఎద్దువాగు


ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు



కాలువను ఆక్రమించి వెంచర్ వేయడంతో కొద్దిపాటి వర్షం కురిసినా నాగన్నకుంటతో పాటు పలు కాలనీలు మునిగి పోతున్నాయి. ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. 20 అడుగుల వెడల్పు కలిగిన కాలువను పూర్తిగా తగ్గించి కేవలం మూడు గోనెలు వేయడంతో వర్షం నీరు, మురుగు పారుదల లేక కాలనీల్లో నీరు చేరుతోంది.

–షేక్ నాగుల్‌బాషా, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు, సత్తెనపల్లి

ఎద్దువాగు ఆక్రమణలు తొలగించాలి



పట్టణంలోని వడ్డవల్లి శివారులోని శాలివాహన నగర్, సుందరయ్య కాలనీ, నాగన్న కుంట, వెంకటపతి కాలనీ పక్కగా వెళ్లే ఎద్దువాగు ఆక్రమణకు గురైంది. దీంతో పట్టణంలోని వివిధకాలనీలు ఎద్దువాగు ఉధృతికి ముంపునకు గురవుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి ఎద్దువాగు ఆక్రమణలను పూర్తిగా తొలగించి పూడికను తీయించాలి. లేకపోతే కాలనీ బాధితులతో కలిసి పోరాటం చేస్తాం.

–వల్లెం లక్ష్మీచెన్నకేశవరావు, సీపీఐ కార్యదర్శి, సత్తెనపల్లి

ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



పెదమక్కెనలో మాట్లాడుతున్న 104 రీజనల్ మేనేజర్ ఖలీం

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని 104 రీజినల్ మేనేజర్ ఖలీం అన్నారు. సత్తెనపల్లి మండలం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెదమక్కెన గ్రామంలో 104 వాహనం ద్వారా ప్రజలకు మంగళవారం వైద్య సేవలు అందిస్తుండగా ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఖలీం మాట్లాడుతూ ప్రజలకు 104 ద్వారా లభించే అన్ని రకాల వైద్య సేవలను పటిష్ఠంగా అమలయ్యే విధంగా చూడాలన్నారు. అందులో భాగంగా 104 వాహనంలో డీఈవో విధులను ఆయన నిర్వహించి డేటా ఎంట్రీ ఆపరేటర్ పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని సలహాలు, సూచనలు ఇచ్చారు. దీని ద్వారా అందించే అన్ని రకాల వైద్య సేవలు ఉచితమని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కవిత, 104 జిల్లా మేనేజర్ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ వై.దావీద్, డీఈవో కె.సుధాకర్, డ్రైవర్ కోటేశ్వరరావు, ఏఎన్ఎం కె.భాగ్యలక్ష్మి, సీహెచ్ఓ రత్నప్రభ, ఆశా వర్కర్లు పద్మ, మరియమ్మ, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో అనారోగ్యం దూరం



గణపవరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు



పరీక్షలు చేస్తున్న డాక్టర్ దీపిక

రాజుపాలెం: మహిళల కోసం ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని డాక్టర్లు సూచించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పురస్కరించుకుని మండలంలోని గణపవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ రవితేజ నాయక్, ఆయుష్ డాక్టర్ పి.శ్రీనివాసరావు 143 మంది మహిళలకు పరీక్షలు చేసి మందులను అందజేశారు. డాక్టర్ రవితేజనాయక్ మాట్లాడుతూ గర్భాశయం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, రక్తహీనత తదితర అంశాలను వివరించారు. డాక్టర్ టి.పవన్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఎంఎల్‌హెచ్‌వో అలేఖ్య, హెల్త్ విజిటర్ ఉషారాణి, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): లంకెలకూరపాడులో స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం మంగళవారం జరిగింది. శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రమాదేవి 95 మందికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ దస్తగిరి, సూపర్‌వైజర్లు పీటర్‌డేమియన్, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నరుకుళ్లపాడులో..

అమరావతి: నరుకుళ్ళపాడులో మంగళవారం అమరావతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సుమారు 124 మంది మహిళలకు రక్తపోటు, హిమోగ్లోబిన్, మధుమేహం, క్షయ వ్యాధి, సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించారు. మహిళలకు నోటి, గర్భాశయ,ఛాతీ క్యాన్సర్ పరీక్షలు, పిల్లలకు టీకాలు, నిర్దిష్ట ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందుల పంపిణీ చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ లీలాప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతల కోసం కిల్కారి కాల్స్ ప్రవేశ పెట్టిందన్నారు. వీటి ముఖ్య ఉద్దేశం మాతా, శిశుమరణాలు తగ్గించటమేనన్నారు. డాక్టర్ మౌనిక మాట్లాడుతూ, ఆరోగ్య విస్తరణాధికారి కె. లక్ష్మీ మనోహర్, సూపర్‌వైజర్ సామ్రాజ్యం, సీహెచ్‌వోలు పుష్ప, త్రిష, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపాలెంలో..

బెల్లంకొండ: పౌష్టికాహారం తీసుకుంటేనే అనారోగ్య సమస్యలు దరి చేరకుండా, నిత్యం ఆరోగ్యంగా ఉండవచ్చని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి దీపిక తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపాలెంలో స్వస్థనారీ– సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 82 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, చిరుధాన్యాలు, కోడిగుడ్లు, పాలు తీసుకోవాలని సూచించారు. రక్తహీనత బారిన పడకుండా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిరణ్ కుమార్, సీహెచ్ఓ మణికుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ, వైద్య, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సమాజాన్ని నిర్మిద్దాం

నూజెండ్ల: గ్రామాలు పరిశుభ్రంగా ఉంచగలిగినప్పుడే మహాత్మాగాంధీ కలలు కన్న స్వచ్ఛ సమాజాన్ని నిర్మించుకోగలమని మండల అభివృద్ధి అధికారి పి.ఉమాదేవి అన్నారు. తలార్లపల్లి, చింతలచెరువు, తదితర గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రహదారుల వెంట చెత్త దిబ్బలను తొలగించి అదే ప్రదేశంలో నీడనిచ్చే చెట్లను నాటే కార్యక్రమం చేపట్టారు. గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చూడాలని పంచాయతీ సెక్రటరీలను ఎంపీడీఓ ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. డెప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణ, సర్పంచ్ తులసారావు, పంచాయతీ కార్యదర్శులు ప్రభాకరరావు, వెంకటేశ్వర్లు, స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ సుబ్బరామయ్య పాల్గొన్నారు.